క్లుప్తంగా

చెక్కుల పంపిణీ



చెక్కులు అందిస్తున్న చైర్మన్ సీతారాములు

నేలకొండపల్లి: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్దిదారులకు మంత్రి శ్రీనివాసరెడ్డి చొరవతో మంజూరైన రూ.24లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం వ్యవసాయ మార్కెట్ చైర్మన్ వెన్నపూసల సీతారాములు అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు శాఖమూరి రమేష్, భద్రయ్య, వెంకన్న, మైశా శంకర్, బచ్చలకూరి నాగరాజు, జెర్రిపోతుల అంజిని, ఈవూరి శ్రీనివాసరెడ్డి, కడియాల నరేష్, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

జుజుల్‌రావుపేట వాసికి అవార్డు

కూసుమంచి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని దళిత అభ్యున్నతికి కృషి చేసిన పలువురికి హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో అవార్డులు అందజేశారు. దీనిలో భాగంగా మండలంలోని జుజుల్‌రావుపేట గ్రామానికి చెందిన పడిశాల వెంకన్నకు ఉత్సవాల కమిటీ చైర్మన్ ఇటుక రాజు, వైస్ చైర్మన్ రాంబాబు అవార్డును అందించారు.

చలివేంద్రం ప్రారంభం

ఖమ్మం మామిళ్లగూడెం: నగరంలోని ఎన్టీఆర్ సర్కిల్‌లో ఆర్ట్ ఆఫ్ లీవింగ్ ఖమ్మం ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం 55వ డివిజన్ కార్పొరేటర్ మోతారపు శ్రావణి సుధాకర్, ఆర్ట్ ఆఫ్ లివింగ్ టీచర్స్ కోఆర్డినేటర్ పి.వెంకట్‌లు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ టీచర్లు శ్రీనివాస్‌రెడ్డి, చైతన్య కిషోర్, రవి, బాలయ్య, నారాయణరావు, వెంకట్ రెడ్డి, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

రఘునాథపాలెం: రఘునాథపాలెంలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ మహిళా డిగ్రీ కాలేజీలో 2024–25 విద్యా సంవత్సరం (డిగ్రీ మొదటి సంవత్సరం) ప్రవేశాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ వేంసాని వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిగ్రీ కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ విభాగాల్లో వివిధ కోర్సులు అందుబాటులో ఉన్నాయని, ఈనెల 16 నుంచి మే 5 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విద్యార్థినులు నేరుగా లేక WWW. miptbcwreis. telangana. gov. in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని, పూర్తి వివరాలకు 70936 28636, 99639 73093 నంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు.

దేవాలయాల్లో సంకటహర చతుర్థి పూజలు

ఖమ్మంఅర్బన్: నగరంలోని దేవాలయాల్లో బుధవారం సంకట హరచతుర్థి పురస్కరించుకుని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందిరానగర్‌లోని శ్రీ బాలగణపతి ఆలయంలో అర్చకులు గిరిధర్ ఆధ్వర్యాన పూజా కార్యక్రమాలు నిర్వహించగా.. మధురానగర్‌లోని సాయి మందిరంలో, సాయిబాబా ఆలయంలో గణపతిస్వామికి విశిష్ట పూజలు చేశారు. దేవాలయ ఈఓ వీవీ నరిసింహారావు, దేవాలయ అధ్యక్ష, కార్యదర్శులు బాజిన్ని వీరయ్య, తిరుపతిరావుల ఆధ్వర్యాన దాత నాగేశ్వరరావు భక్తులకు అల్పాహారం అందించారు.

నగరంలో సినిమాలు

తిరుమల	గుడ్‌బ్యాడ్ అగ్లీ
వినోద	మ్యాడ్ స్క్వేర్
సాయిరాం	జాట్
ఆదిత్య	అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి రాబిన్ హుడ్
శ్రీనివాస	జాక్

- ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	20	బచ్చలికూర	4
వంకాయ	20		20
బెండకాయ	20	పాలకూర	4
పచ్చిమిర్చి	36		20
కాకర	46	చుక్కకూర	4
బీట్‌రూట్	24		20
బీర	46	తోటకూర	4
దొండ	18		20
పొట్లకాయ	36	గోంగూర	4
చిక్కుడు	86		20
గోరుచిక్కుడు	36	మెంతికూర	3
క్యాబేజీ	20		20
క్యాలీఫ్లవర్	30	కొత్తిమీర	1
ఆలుగడ్డ	30		30
చామగడ్డ	46	పుదీన	1
క్యారెట్	26		20
క్యాప్సికం	50	-ఖమ్మం వ్యవసాయం	

అలా.. అయిపోతుందంతే!

చట్టంలో లొసుగులను వాడుకుంటున్న ఉద్యోగులు

- స్వీయ అంచనా పత్రాలకు ఆటోమెటిక్‌గా ఆమోదం
- 15 రోజుల్లో పరిశీలించాల్సిన దరఖాస్తులపై తాత్సారం
- కొందరి సిబ్బంది తీరుతో ఇబ్బంది పడుతున్న ఆర్ఐలు



ఖమ్మంమయూరిసెంటర్: చట్టంలో ఉన్న చిన్నపాటి అనుకూలతలను ఆసరాగా చేసుకొని కొందరు అధికారులు, సిబ్బంది చేతివాటానికి పాల్పడుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఇంటి అసెస్మెంట్లకు సంబంధించి యజమానులతో కుమ్మక్కైన వీరు గడువు తీరే సమయంలో దరఖాస్తులను ఉన్నతాధికారుల నుంచి కింది స్థాయి అధికారులకు చేరేలా చేస్తూ సహజంగానే అసెస్మెంట్ నంబర్ వచ్చేలా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నూతన నిర్మాణాలకు అసెస్మెంట్ నంబర్ల కేటాయింపులో ఒకరిద్దరు అధికారులు, కొంత మంది సిబ్బంది, మాజీ సిబ్బంది, బయట వ్యక్తులు తమ చేతివాటం ప్రదర్శిస్తున్నట్లు తెలుస్తోంది. లోసుగులతో పూర్తయిన నిర్మాణాలకు అసెస్మెంట్ నంబర్లు కేటాయింపులో ఈ బృందం కీలకంగా వ్యవహరిస్తుందనే ఆరోపణలు ఉన్నాయి.

15 రోజులు దాటితే..

ప్రభుత్వం మున్సిపల్ యాక్ట్ ప్రకారం సెల్ఫ్ అసెస్మెంట్ చేసుకున్న డాక్యుమెంట్లను 15 రోజుల్లో అధికారులు పరిశీలన చేసి అసెస్మెంట్ నంబర్ కేటాయింపునకు అనుమతులు ఇవ్వాలి. నంబర్ వచ్చిన తర్వాత భవన యజమానులు మున్సిపాలిటీకి పన్ను చెల్లింపులు చెల్లించేలా వీలు కల్పించడంతో పాటు పంపు కనెక్షన్లు, ఇతర వాటికి అనుమతులు ఇస్తుంటారు. 15 రోజుల్లో అధికారులు దరఖాస్తులను పరిశీలించకుంటే సహజంగానే సదరు డాక్యుమెంట్లకు ఆమోదం పొంది అసెస్మెంట్ నంబర్, ఇంటి నంబర్ కేటాయింపు జరుగుతుంది. ఈ విధానంతో అనుమతులు లేకుండా చేపట్టిన నిర్మాణాలు, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న భవనాలు, కొలతలు తప్పుగా వేసిన దరఖాస్తులకు సైతం అనుమతులు జారీ అవుతున్నాయి.

ఆలస్యంగా ఆర్ఐల చెంతకు..

కేఎంసీలో అసెస్మెంట్ నంబర్ల కేటాయింపునకు సంబంధించి అవకతవకలు జరుగుతున్నాయనే విమర్శలు ఉన్నాయి. అనుమతులు లేకుండా చేపట్టిన నిర్మాణాలు, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న భవనాలు, ప్రభుత్వ స్థలాల్లో చేపట్టిన నిర్మాణాలకు డీమ్డ్ విధానంలో నంబర్లు కేటాయింపు జరిగేలా కొంతమంది వ్యవహరిస్తున్నారన్న చర్చ కేఎంసీలో జరుగుతోంది. రెవెన్యూ విభాగ అధికారులు తీరిక లేకుండా పన్నుల వసూళ్లు, సర్వేలు వంటి పనుల్లో నిమగ్నమైన సమయాల్లో కొన్ని దరఖాస్తులను సిబ్బంది కావాలనే ఆలస్యంగా ఆర్ఐలకు ఇస్తున్నట్లు తెలుస్తోంది. చివరి రోజు దరఖాస్తులు ఇవ్వడంతో ఆర్ఐలు పరిశీలన కూడా చేయలేకపోవడంతో సంబంధిత దరఖాస్తులకు డీమ్డ్ అప్రూవల్ వస్తున్నట్లు సమాచారం. ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి, మార్చిలలో పదుల సంఖ్యలో దరఖాస్తులకు డీమ్డ్ అప్రూవల్ వచ్చేలా సిబ్బంది వ్యవహరించారన్న ఆరోపణలు ఉన్నాయి.

15 రోజుల్లోనే..

కేఎంసీలో అసెస్మెంట్, ఇంటి నంబర్ల కోసం యజమానులు ఆన్‌లైన్‌లో సెల్ఫ్ అసెస్మెంట్లు చేసుకుంటుంటారు. ఈ దరఖాస్తులు నేరుగా కేఎంసీ కమిషనర్ లాగిన్‌కు వెళ్తుంటాయి. అక్కడి నుంచి సంబంధిత ఆర్ఐకు చేరి సదరు దరఖాస్తుల పరిశీలన బిల్లు కలెక్టర్లకు అప్పగిస్తారు. వారు దరఖాస్తులను పరిశీలన చేసి నిర్మాణాలు నిబంధనల ప్రకారం ఉన్నాయా? లేదా? పరిశీలన చేసి కొలతలు, స్థల డాక్యుమెంట్‌ను పరిశీలన చేసి ఆర్ఐకు నివేదిక ఇవ్వాల్సి ఉంది. ఆర్ఐ వాటిని పరిశీలించి వాటిపై పూర్తి నివేదికను ఆర్ఓ లాగిన్‌కు పంపిస్తారు. అక్కడ నుంచి కమిషనర్ లాగిన్‌కు వెళ్తుంటాయి. ఆర్ఐ, ఆర్ఓ ఇచ్చిన రిమార్క్‌ల ప్రకారం కమిషనర్ అసెస్మెంట్ కేటాయింపునకు అనుమతులు ఇవ్వడమా.. రిజెక్ట్ చేయడమా చేస్తుంటారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న రోజు నుంచి 15 రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తి కావాల్సి ఉంది.

రీ వెరిఫికేషన్ చేయిస్తాం..



గత నాలుగైదు నెలల్లో డీమ్డ్ అప్రూవల్ వచ్చిన దరఖాస్తులన్నింటినీ రీ వెరిఫికేషన్ చేయిస్తాం. అధికారులు పరిశీలించి అనుమతులు ఇచ్చిన దరఖాస్తులను పరిశీలన చేసేందుకు చర్యలు చేపడుతున్నాం.

– అభిషేక్ అగస్త్య, కేఎంసీ కమిషనర్

'ఆపరేషన్ కగార్'ను వెంటనే నిలిపివేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న శంకర్‌రావు

ఖమ్మం మామిళ్లగూడెం: మావోల ఏరివేతే లక్ష్యంగా కేంద్రం ప్రవేశపెట్టిన ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని టీజేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపగాని శంకర్‌రావు డిమాండ్ చేశారు. బుధవారం ఖమ్మంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆపరేషన్ కగార్ పేరుతో అమాయక గిరిజనులను పోలీసులు కాల్చి చంపడాన్ని నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసులను అడవి నుంచి తరిమేసి అక్కడున్న ఖనిజ సంపదను దోచుకునే కుట్రలో భాగమే ఈ ఆపరేషన్ అన్నారు. నాటి జేఏసీ చైర్మన్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్‌కు కేబినెట్‌లోకి తీసుకొని విద్యాశాఖ ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని తిరుమలాయపాలెం, ఖమ్మం రూరల్ మండలాలను పునర్విభజన చేసి సుబ్లేడు, ఎం వెంకటాయపాలెంలను మండలాలుగా ప్రకటించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు హుస్సేన్, ఖమ్మం నగర అధ్యక్షుడు బెల్లంకొండ నాగేశ్వరరావు, ఎస్టీ సెల్ అధ్యక్షుడు బానోత్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేటి సమాచారం

● విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంవ్యవసాయం/ఖమ్మంఅర్బన్: నగరంలోని ఆర్టీవోస్ 11 కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్లకు ఆటంకంగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా గురువారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 10 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టౌన్–3 ఏఈ జి.వెంకన్న బుధవారం తెలిపారు. దీంతో శ్రీశ్రీ హోటల్, బైపాస్ రోడ్, శ్రీరామగిరి, న్యూ బస్టాండ్ ఏరియా, వికలాంగుల కాలనీలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అదే విధంగా మమత రోడ్ సబ్ స్టేషన్‌కు ప్రత్యామ్నాయంగా ఉన్న లైన్ నిర్వహణ పనుల కారణంగా 11 కేవీ మైసమ్మ గుడి ఫీడర్ పరిధిలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వీఆర్‌కే సిల్క్స్ నుంచి లకారం ట్యాంక్ బండ్ వరకు కరెంట్ కోత విధించబడుతుందని టౌన్–2 ఏడీఈ యాదగిరి పేర్కొన్నారు. విద్యుత్ సిబ్బందికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

● 'భూ భారతి'పై అవగాహన సదస్సు

రఘునాథపాలెం: ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన భూభారతి చట్టంపై నేడు(గురువారం) ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తహసీల్‌లో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ విల్సన్‌బెన్నీ తెలిపారు. రైతులు సకాలంలో పాల్గొనాలన్నారు.

● బీఆర్ఎస్ సన్నాహక సమావేశం

తిరుమలాయపాలెం: వరంగల్‌లో ఈ నెల 27న నిర్వహించే బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభను విజయవంతానికి గురువారం తిరుమలాయపాలెంలో సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు భాషబోయిన వీరన్న ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 3 గంటలకు జరిగే సమావేశానికి ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాత మధుసూధన్, మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య హాజరవుతున్నట్లు చెప్పారు.

అంగన్‌వాడీ కేంద్రాలను వినియోగించుకోవాలి

నేలకొండపల్లి: అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ ఏసీడీపీఓ రత్నకుమారి సూచించారు. మండలంలోని తిరుమలాపురం అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషణ పక్షం కార్యక్రమాన్ని నిర్వహించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. అనంతరం గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం.యర్రయ్య, సూపర్‌వైజర్ పి.నాగమణి, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఆశా కార్యకర్తలు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

'రాయల' పర్యటన

నేలకొండపల్లి: రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌లు మండల కేంద్రంలో బుధవారం మృతి చెందిన పి.అనురాధ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ గూడవల్లి రాంబ్రహ్మం, మాజీ సర్పంచ్ రాయపూడి నవీన్, భద్రయ్య, నాగరాజు, అంజిని, నరేష్, జాన్‌రెడ్డి, ఏడుకొండలు, సత్యనారాయణ, వున్నం బ్రహ్మయ్య, పోలంపల్లి నాగేశ్వరరావు, ఎస్.నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం పైనంపల్లి, సింగారెడ్డిపాలెం తదితర గ్రామాల్లో పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

మిస్ వరల్డ్ పోటీలు నిర్వహించొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న సరళ

ఖమ్మం మామిళ్లగూడెం: తెలంగాణలో జరిగే 72వ మిస్ వరల్డ్ పోటీలను రద్దు చేయాలని ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బుగ్గవీటి సరళ, జిల్లా కార్యదర్శి బండి పద్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మెరుగు రమణ అధ్యక్షతన ఖమ్మం సుందరయ్య భవన్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. మహిళలపై అత్యాచారాలు, హింస జరుగుతుంటే అరికట్టాల్సింది పోయి అందాల పోటీల పేరుతో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ఖర్చు పెట్టే ప్రయత్నం చేస్తున్నారని.. ఇది ప్రజలపై మరింత భారం పడే ప్రమాదం ఉందని విమర్శించారు. పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లును వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళా ఉద్యమనాయకురాలు కొండపల్లి దుర్గాదేవి వర్ధంతిని జిల్లాలోని అన్ని గ్రామాల్లో జరపాలని వారు కోరారు. ఈ సమావేశంలో ఐద్వా జిల్లా నాయకురాలు నెహ్రూన్నీసాబేగం, పి.ప్రభావతి, పి.సుమతి, కె.అమరావతి, బెల్లం లక్ష్మి, సునీత, జి.రజిత, బాగం అజిత, కృష్ణవేణి, జాజిరి జ్యోతి, ఫరీదా, పద్మ, సుగుణమ్మ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

'రైతు రక్షణ'లో భాగస్వాములు కండి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు

కామేపల్లి: రైతు రక్షణ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని రైతు రక్షణ సిద్ధాంతకర్త బాకి భైరెడ్డి, హైదరాబాద్ జనని ఫౌండేషన్ చైర్మన్ రాచకొండ మల్లేశ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో చార్డ్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు సామల బాబు అధ్యక్షతన జరిగిన రైతు రక్షణ కార్యక్రమంపై ప్రత్యేక అవగాహన కల్పించారు. రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర కల్పిస్తూ వారి ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు కల్పించేందుకు తమ సంస్థ కృషి చేస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ రైతు రక్షణ కార్యక్రమంలో చేరాలని కోరారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో చార్డ్ కోఆర్డినేటర్ జర్పుల రవీందర్, రైతులు, యువకులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనాలి



తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న నాయకులు

కూసుమంచి: అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. కూసుమంచిలో మంగళవారం అర్ధరాత్రి కురిసిన వర్షానికి తడిసిన ధాన్యాన్ని నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా నాయకుడు గుండా ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతు పక్షపాతిగా చెబుతున్న ఈ ప్రభుత్వ పాలనలో పంటను కాపాడుకునేందుకు కనీసం టార్పాలిన్ పట్టాలు కూడా లేవని విమర్శించారు. తాము రైతుల పక్షాన నిలబడి సమస్యలపై పోరాటాలు సాగిస్తున్నామని, తడిసిన ప్రతీ గింజను కొనాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వేణు, మధు, నాగేశ్వరరావు, రంజిత్‌రెడ్డి, హనుమంతు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్ల పుట్టడం అదృష్టం



కూసుమంచి: కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు



ఖమ్మంవన్‌టౌన్: సర్టిఫికెట్లు అందిస్తున్న అధికారులు

● కూసుమంచి: ఆడపిల్ల పుట్టడం అదృష్టమని మండల ప్రత్యేకాధికారి, జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ శ్రీలత అన్నారు. మా ఇంటి–మణి దీపం కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని చేగొమ్మగ్రామానికి చెందిన తాటికొండ ఇందు–వినయ్‌కుమార్ దంపతులకు ఆడబిడ్డ పుట్టగా వారి ఇంట్లో దంపతులను సన్మానించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. అనంతరం వారికి పండ్లు, స్వీట్లు అందించి శుభాకాంక్షలు తెలిపాక సర్టిఫికెట్ అందజేశారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ కవిత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రమాదేవి, సువర్చల, పుష్పావతి, అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

● ఖమ్మంవన్‌టౌన్: నగరంలోని బుర్హాన్‌పురం సెక్టార్ 49వ డివిజన్ అంగన్‌వాడీ కేంద్రంలో లక్ష్మి–అశోక్ దంపతులను సత్కరించి సర్టిఫికెట్ అందించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ వీరభద్రమ్మ, సమ్రిన్, సూపర్‌వైజర్ సుధా భవానీ, ఏఎన్ఎం రాజేశ్వరి, వేముల ఉమా తదితరులు పాల్గొన్నారు.

● నేలకొండపల్లి: మండలంలోని తిరుమలాపురం



దంపతులను సన్మానిస్తున్న ప్రత్యేకాధికారి రవిబాబు

గ్రామం ఆడబిడ్డ పుట్టిన నెమలి సుజాత–గురవయ్య దంపతుల ఇంటికి వెళ్లి తల్లిదండ్రులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి రవిబాబు, ఎంపీడీఓ ఎం.యర్రయ్య, సూపర్‌వైజర్ పి.నాగమణి, విజయకుమారి, అంగన్‌వాడీటీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

కేఎంసీ సమాచారం

● రోడ్లపైకి డ్రెయినేజీ నీరు రాకుండా చర్యలు తీసుకోవాలి



49వ డివిజన్‌లో పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ అభిషేక్ అగస్త్య

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలో వర్షం కురిసిన సమయంలో డ్రెయినేజీ నీరు రోడ్లపైకి రాకుండా చర్యలు తీసుకోవాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య అధికారులను ఆదేశించారు. బుధవారం నగరంలోని 49, 19వ డివిజన్లలో పర్యటించి రోడ్లపై నిలిచిన నీటిని పరిశీలించి పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. రోడ్లపై నీరు నిల్వకుండా అవసరమైన చోట్ల రోడ్ల ఎత్తు పెంచేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. డివిజన్లలో ప్రతి రోజు చెత్త సేకరణ జరుగుతుందా లేదా అని స్థానికులను ఆరా తీశారు.

● చెట్ల కొమ్మలు తొలగింపు..

మంగళవారం రాత్రి వచ్చిన గాలిదుమారానికి నగరంలోని పలు ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. బుధవారం డీఆర్ఎఫ్ సిబ్బంది వాటిని తొలగించారు. పెద్దపెద్ద కొమ్మలను కట్ చేసి తొలగించి వీధుల్లోంచి బయటకు తరలించారు.

● డీఆర్ఎఫ్ సిబ్బందిపై విమర్శలు..

నగరంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించేలా, ప్రజలకు ఇబ్బందికరంగా రోడ్ల వెంట ఏర్పాటు చేసిన తోపుడు బండ్లు, డబ్బాలు, ఇతర వాహనాలు, నేమ్ బోర్డులు, వాహనాలను కేఎంసీ అధికారుల ఆదేశాలతో డీఆర్ఎఫ్ సిబ్బంది తొలగించి కేఎంసీ కార్యాలయానికి తరలిస్తుంటారు. అయితే కొంత మంది సిబ్బంది అధికారులు కాకుండా బయట వ్యక్తులు చెప్పిన బండ్లను కార్యాలయానికి తరలిస్తున్నారని, ఏదైనా ఉంటే స్థానిక కార్పొరేటర్లతో మాట్లాడుకోవాలని బండ్ల యజమానులకు చెబుతున్నారన్న విమర్శలు ఉన్నా యి. అధికారుల వద్దకు వెళ్లకుండా కార్పొరేటర్ల వద్ద కు వెళ్లాలని సూచించడంపై విమర్శలు వస్తున్నాయి.

● కార్మికుల గైర్హాజరుపై ఫిర్యాదు..

పారిశుద్ధ్య కార్మికులు గైర్హాజరవుతుండడంతో డివిజన్లలో పారిశుద్ధ్య పనులు కుంటుపడుతున్నాయని, గైర్హాజరైన వారి స్థానంలో వేరే కార్మికులను కేటాయించాలని ఇద్దరు కార్పొరేటర్లు అసిస్టెంట్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. కార్మికులు గైర్హాజరు కాకుండా చూస్తామని, కార్మికులంతా హాజరయ్యేలా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

● అధికారి, కార్మిక సంఘం నాయకుడికి మధ్య వాగ్వాదం..

పారిశుద్ధ్య కార్మికులకు జాతీయ నాయకుల జయంతి వేడుకల్లో సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఓ కార్మిక సంఘ నేత పారిశుద్ధ్య అధికారిపై వాగ్వాదానికి దిగారు. జాతీయ నాయకుల జయంతి ఉత్సవాల రోజున ఒక పూట మాత్రమే కార్మికులతో పని చేయిస్తామని అధికారి చెప్పనా్న కార్మిక సంఘ నేత అధికారిపై తీవ్ర వాగ్వాదానికి దిగినట్లు తెలిసింది. ఉద్యోగులు, అధికారులపై బయట వ్యక్తుల అజమాయిషీ పెరుగుతుందని, అధికారులను కించపరిచేలా మాట్లాడుతున్నారని సిబ్బంది ఆరోపించారు. ఈ విషయమై అధికారులను వివరణ కోరగా.. కార్మిక సంఘాల నేతలు వచ్చి తమతో వాగ్వాదానికి దిగిన విషయం నిజమేనని తెలిపారు.

వినతులు

● ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలపై..



ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

రఘునాథపాలెం: ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలను పరిష్కరించాలని బుధవారం మండల కమిటీ ఆధ్వర్యాన మండలంలో ఫీల్డ్ అసిస్టెంట్లు నిరసన కార్యక్రమాల్లో భాగంగా ఎంపీడీఓ అశోక్‌కుమార్, తహసీల్దార్ విల్సన్‌బెన్నీలకు వినతిపత్రాలు సమర్పించారు. వేతనాలు, ఉద్యోగ భద్రత, హెల్త్ కార్డులు సహా అనేక సమస్యలు పరిష్కరించాలని వినతిలో పేర్కొన్నారు. మూడు నెలల పెండింగ్ వేతనాలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రఘునాథపాలెం మండల అధ్యక్షుడు, జిల్లా జాయింట్ సెక్రటరీ బరిగెల కోటేశ్వరరావు, రాష్ట్ర జనరల్ సెక్రటరీ చల్లా వెంకటేశ్వర్లు, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు చల్లా రాధిక, జిల్లా ప్రధాన కార్యదర్శి తూరిగంటి సూర్యం, ప్రసాద్, నాగులుమీరా, ఉపేందర్, శ్రీను, మస్తాన్, వెంకటేశ్వర్లు, శ్రీదేవి పాల్గొన్నారు.

● రాజకీయ వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలి




డీఆర్ఓకు వినతి పత్రం ఇస్తున్న బీజేపీ నేతలు

ఖమ్మం మామిళ్లగూడెం: నగరంలోని పదో తరగతి బోర్డు పరీక్షల ప్రత్యేక పర్యవేక్షణ కేంద్రంలో, జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యాన నిర్వహించిన అంబేడ్కర్ జయంతి కార్యక్రమంలో ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు చేసిన రాజకీయ వ్యాఖ్యలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని బీజేపీ నేతలు బుధవారం డీఆర్ఓ రాజేశ్వరికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ ఖమ్మం అర్బన్ టౌన్ అధ్యక్షుడు కుమిలి శ్రీనివాస్ మాట్లాడుతూ.. సదరు ఉపాధ్యాయుడు మోదీ ప్రభుత్వ విధానాలను విమర్శించాడం సరైంది కాదన్నారు. బీజేపీ ఖమ్మం అసెంబ్లీ కన్వీనర్ అల్లిక అంజయ్య, వీరవెల్లి రాజేష్‌గుప్తా, బండ్ల రీగన్ ప్రతాప్, కందుల శ్రీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్



రోడ్డు కరాబ్..!



నగరంలోని మామిళ్లగూడెం ప్రధాన రహదారిలో గ్రామీణ బ్యాంకు వద్ద ఉన్న రోడ్డుపై చిన్న చినుకు పడినా నీరునిలిచి అధ్వానంగా తయారవుతుంది. గత కొన్నేళ్లుగా ఇదే పరిస్థితి ఉంటుండగా.. మంగళవారం రాత్రి కురిసిన వర్షానికీ జలమయంగా మారి స్థానికులు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. గతంలో ఈ విషయాన్ని మున్సిపల్ అధికారులకు తెలపగా రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసి వదిలేశారు. రెండేళ్లవుతున్నా ఎవరూ పట్టించుకోకపోవడంతో రోడ్డంతా గతుకులుగా మారి నీరు నిలుస్తోంది. దీంతో అటుగా వెళ్లే ప్రయాణికులు కిందపడి గాయాలపాలవుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

- ఖమ్మం రాపర్తినగర్